
# ఆశలు అలలు



"ప్రియమైన సూర్యం,

కొంప మునిగే అవసరం లేనిదే మిత్రుల కుత్తరాలు రాయననే నా కున్న పేరు సార్థకం చేసుకుంటూనే ఈ ఉత్తరం రాస్తున్నాను.

చిలిపిగా ముగిసిన బాల్యం, మనమేమిటో తెలియకుండా గడిచిన హైస్కూలు రోజులు, హాయిగా నడిచిన కాలేజీజీవితం, కమ్మనికలగా శారదను ప్రేమించడం, అదే నా భాగ్యంగా మా ఇద్దరికీ వివాహం జరగడం, అయిదేళ్ల వైవాహిక జీవితంలో స్వర్గాన్ని చవిచూడడం . . . తీయని స్మరణీయ స్మృతులు నా జీవితంలో అంతవరకే మిగిలిపోయాయి.

లేకుంటే భగవంతుడింత నిర్దయగా నాకీ అశాంతరాన్ని ఈ వయస్సుకే కలిపించడు!

ఇక శారద! కేవలం శారదగా, ఓ పేద ఇంటి ఆడబడుచుగా, మామూలుగా చూస్తే అందంగా పాలరాతిబొమ్మలా, స్త్రీ ధర్మకోణంలో నించి చూస్తే లలిత ప్రవృతిగల అతివగా మాత్రమే మనమెరుగుదుము. కాని, శారద ఎంత ఉన్నతహృదయినో ఇక్కడ వ్యక్తపరచలేను. నిజంగా నాకు దేవత, మా కుటుంబం వారందరికీ ఇలవేలుపు. నా అదృష్టాన్ని తలచుకుంటే నాకే గర్వంగా ఉంది.

కాని,

ఇంతవరకు నిర్మలంగా వీక్షించిన భగవంతుడు ఇప్పుడు పరీక్షిస్తున్నట్లున్నాడు. ఈ పరీక్షలో ఒకవేళ నే నోడిపోతే! . . . ఊహించలేను సూర్యం, నేనా భయంకరసత్యాన్ని ఊహించలేను.

సంవత్సరంనించి తాత్సారం చేస్తున్న ఈ చిన్ని నొప్పి గుండెనొప్పి అని మొన్ననే వరంగల్‌లో అత్యంతప్రియుమైన ఓ డాక్టరు నిర్ణయించాడు. ఈ వయస్సుకే ఇదేమిటని ఆశ్చర్యపోతున్నావు కదూ! ఈ జబ్బు నయం కావాలంటే కేవలం ఆపరేషన్ చెయ్యవలసిందేనట! అది ఇక్కడెక్కడో కాదు, రాయవేలూరులో.

ఈ భయంకర నిజాన్ని చెప్పి ఇంతవరకు ఎవరి గుండెలూ పగిలగొట్టలేదు. ఒక్క నాలుగు రోజుల్లోపల నీవు తప్పకుండా రావాలి. అప్పటికి అందరికీ తెలిసి పోతుంది.

భగవంతుడెలాంటి చూపు చూడదలిచినా, ఉత్తమురాలైన శారద, ఉత్తమమైన మిత్రుడివి నీవు మీ ఇరువురుగా నా పక్కనే ఉండాలని నా అభిలాష.

వచ్చే ఆదివారమే ప్రయాణం.

ఈ ఉత్తరం అందిన వెంటనే బయలుదేరి వస్తావు కదూ!

ప్రకాశం."

ఆదివారం పెందలకడ ప్రయాణించేస్తూ ఉత్తరాన్ని అలా ఎన్నిసార్లు చదువుకున్నానో లెక్కలేదు. శ్రీమతిని పుట్టింటికి పుట్టింటికి పంపించడం, ఆ ఉత్తరం రావడం దాదాపు రెండు ఒకేసారి జరిగాయి. వెంటనే టూరు ఆలోచించి రెండు నెలల ఎర్న్‌డ్ లీవు పెట్టి, సుబ్బారావు కోసం వేచి చూడకుండా బయలుదేరాను.

రైలు ఒక్క కుదుపుతో ఆగింది.

ప్రకాశం పెళ్లినాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ దిగాను. అది రఘునాథపల్లి స్టేషన్. అక్కడికి నందనం—ప్రకాశం ఊరు—దాదాపు నాలుగు మైళ్లు.

రాత్రి ఎనిమిది గంటలయింది. తెల్లగా వెన్నెల పూచింది. చల్లగా గాలులు వీస్తున్నాయి. గతించిన జ్ఞాపకాలు స్మృతిపథంలో మెదలుతూండగా నందనం దారిపట్టాను.

హైస్కూలు వదిలి కాలేజీలో చేరే రోజుల్లో నాకూ, ప్రకాశానికీ పరిచయమైంది. ఆ పరిచయం పెరిగి మమ్మల్ని అతి సన్నిహితుల్ని చేసింది. మాకు తోడుగా బృందం లేకపోలేదు. మా బృందంలో మనిషికో ప్రత్యేకత ఉండేది. అందరి ప్రత్యేకతల్లోను మా ఇద్దరి పత్యేకతలు మరీ ప్రత్యేకంగా కనబడేవి.

క్యారమ్స్, చదరంగంలాంటి సుతారమైన ఆటలాడటం, సాంస్కృతికోత్సవాల్లో తెరవెనక పాటలు పాడటం, రోడ్లమీద బట్టలు నలగకుండా నిదానంగా నడవడం, మిత్రులతో మితంగా మాట్లాడటం, ఎదటివాళ్లు హాస్యాలు విసిరినప్పుడు సన్నగా నవ్వడం, మిగిలిన కాలంలో కుదురుగా చదువుకోడం—ఇవి అప్పుడు నాకున్న ప్రత్యేకతల్లో కొన్ని.

ప్రకాశం, ప్రతి రంగంలోను తానే పైచేయిగా కనిపించేవాడు; ఒక్క చదువులో మాత్రం అంతంత మాత్రంగానే. కాలేజీరాజకీయాలనుండి అమ్మాయిలను ఏడిపించడం వరకు ప్రకాశమే పరోక్షనాయకుడు.

హైస్కూల్లో ఒక్క రూపాయి నా కెంతో విలువగా కనిపించేది. ప్రకాశం రూమ్మేటయిన దరిమిలా డబ్బువిషయంలో చాలా తేలికభావం ఏర్పడింది. నాకు చేసిన సహాయానికి ప్రకాశానికి కలకాలం ఋణపడి ఉంటాను.

కాలేజీ ఆఖరు సంవత్సరం కోసం, సెలవులు ముగించి, గది కోసం అన్వేషణ ప్రారంభించాం.

అప్పుడే శారదవాళ్ళు అద్దెకుండే పెద్ద కాంపౌండు లోని కిందిభాగంలో ఓ గది దొరికింది. శారదవాళ్ళు మేడమీది భాగంలో మా గది కెదురుగా ఉండేవారు.

శారద మాకు పరిచయమయ్యేవరకు మా ఇద్దరి మధ్య ఏ దాపరికాలు ఉండేవికావు.

రోజులు గడిచిన కొద్దీ తెలిసిందేమంటే, శారద మెట్రిక్యులేషన్ పూర్తిచేసి బేసిక్ ట్రైనింగవు తూందని, తండ్రి ఓ ఫ్యాక్టరీలో పని చేస్తూంటాడని, తమ్ముడు చదువుకుంటున్నాడని.

మొదటిసారి శారదను చూసినప్పుడు అయిదు నిమిషాల వరకు నా మస్తిష్కం పని చేయలేదు. ప్రకాశం చూసి ఏమయినాడో ఊహించుకోగలను. కాని ప్రకాశం బయటపడడు. నేను ఊరికే బయటపడి పోతాను. అదే మా ఇద్దర్లోను తేడా.

శారదతో మొదటిసారి మాట్లాడ్డానికి ఎన్నో రోజులు నిరీక్షించాను. నా నిరీక్ష ఫలించిన రోజున నా ఆనందానికి అవధుల్లేవు. ఆ మధురక్షణాలు ఇంతకాలం వరకూ నాలో సజీవంగా ఉన్నాయి.

పరీక్షల రోజులు దగ్గిరవుతున్నా ప్రకాశానికి వాటి పట్టింపు ఉండేది కాదు. అలిసిపోయేవరకు ఆడి, సుష్టుగా భోంచేసి, పెందలాడే నిద్ర పోయేవాడు. నాకు ఒక్కోరాత్రి రెండైనా నిద్ర వచ్చేది కాదు. కిటికీలోనుండి కనిపించే శారద ఇంటివేపు చూస్తూ నిశ్శబ్దంగా కాలం గడిపేవాణ్ణి.

మదిలో ఏదో మెదలగా, ఓ అర్ధరాత్రి అంతా నిద్రపోయిన తరవాత ఎదురుమేడ పిల్లిలా ఎక్కాను. శారద ఇంటికిటికీ తెరిచే ఉంది. మెల్లిగా కిటికీలో నుండి చూశాను. నీలంరంగు బెడ్‌బల్బ్ కాంతుల్లో, మంచంమీద అందంగా నిద్రపోయిన శారదను చూసి మనస్సెంత మధురంగా మూగపోయిందో ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. నే చేస్తున్నదొక అసభ్యమైన పని అని నాకా క్షణంలో తోచలేదు. ఎంతసేపు ఆ కిటికీవద్ద మానులా నిలుచుని ఆ అందాన్ని ఆస్వాదించానో!

ఎవరో దగ్గిన చప్పుడవడంతో గబగబా మేడ దిగాను.

అర్ధరాత్రుల్లో అలా చేయడం అలవాటయింది.

ప్రకాశానికి నా పరిస్థితి చెప్పాలనుకున్నాను. చదువు ధ్యాస పూర్తిగా పోయింది. ఏ పుస్తకం తెరిచినా శారద అందంగా కనబడేది. ప్రకాశాన్ని బతిమిలాడి, ఒప్పించి ఎలాగైనా శారదను వాదాన్ని చేసుకోడానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించు కున్నాను.

ఓ ఉదయం ప్రకాశాన్ని అడగబోయాను. తీరా ప్రకాశం నా కళ్ళల్లోకి చూసేసరికి మాట మార్చేశాను. నా పరిస్థితి ప్రకాశం గమనిస్తున్నాడేమో నని నా కనుమానం లేకపోలేదు.

ధైర్యం చేసి శారదనే అడగాలని నిశ్చయించు కున్నాను. బస్సుస్టాండు దగ్గిర నేనూ నేను కలిసి ఎన్నోమార్లు నవగడానికి ప్రయత్నించి, రాజసం ఉట్టిపడే ఆ గంభీరవదనంలోకి చూసేసరికి ఆ విషయంపై నా జిహ్వ ఆడేది కాదు.

అప్పటికే శారదకూడా ప్రకాశానికి పరిచయ మయింది. కేవలం మామూలు పరిచయం మాత్రమే.

*అది మంచిది కావచ్చు, చెడ్డది కావచ్చు. చెడ్డదైన ఆ విషం లాటిది. కాలం గడచినా విషంలోని లక్షణం మారదు. ఒక స్త్రీపట్ల పురుషుడు ఏర్పరచుకున్న భావం ఎలాటిదైనా, మారడం జరగదేమో! కాలం ఎన్నింటినో కప్పివేస్తుంది, కానీ కామాన్ని మరుగుపరచలేదు.*

వాడి దగ్గిరెప్పుడూ నసుగులూ, గుసగుసలూ లేవు. ధైర్యంగా అందరి ఎదట ఏ విషయమైనా కుండ బద్దలు కొట్టినట్లు మాటాడలాడు. శారదను గురించి అంత దూరం ఆలోచించడానికి వాడికి టైము దొరికిందని నాకు నమ్మకం లేదు. శారద కుటుంబం వారందరితోను సరదాగా తిరిగేవాడు.

నే నెప్పుడూ నా గది, నా స్వప్నాలు.

ఆఖరు అవకాశంగా మా కాలేజీ డే వచ్చింది.

"ఏమండోయ్ శారదగారూ, మరచకూడదు. తప్పకుండా రావాలి. మనం హీరోగ వేస్తున్నామంటే చూసి తరించవలిసిందే!" మెట్లు దిగుతూ పెద్దగ అంటున్నాడు ప్రకాశం చిరునవ్వుతో.

వరండాలో నిలుచుని నిర్మలంగా నవ్వుతూ అలాగే అన్నట్లు తల ఊపుతూంది శారద. నేను కిటికీలో నుండి చూస్తూనే ఉన్నాను. శారద వాడితో అంత చనువుగా ఉండడంతో నా కెందుకో కలుక్కుమంది.

ప్రకాశం గదిముందు ఆగి "నాయనా, సూర్యం, ఇంకా ఆ గ్రంథకన్యారాధనలోనే ఉన్నావురా? నువ్వు ఫెయిలయితే ఇంకెవడురా పాసయ్యేది?" అన్నాడు.

తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో బయటికి వచ్చాను.

"ఒరే తండ్రీ, శారదగారూ మా డ్రామా చూడ్డానికి వస్తున్నారు. కాస్త పెందలాడే తెమిలి వారిని తీసుకురా" అన్నాడు.

అలాగే అన్నట్లు సన్నగా నవ్వాను.

"ఈ రోజే, రేపనుకునేవు!" అని పెద్దగా నవ్వుకుంటూ వెళ్ళాడు ప్రకాశం.

పైకి చూశాను.

ఎదురుగా, స్నిగ్ధంగా నవ్వుతూంది శారద నావేపు చూపులాపి.

అదే మొట్టమొదటిసారి శారద నా ఎదురుగా నవ్వడం.

'త్వరగా రండి, వెళదాం!' అన్నట్లు సైగ చేశాను.

సరే అన్నట్లు తల ఊపి లోనికి వెళ్ళింది.

ప్రకాశం దైవంలా మెదిలాడు ఆ క్షణాన. ఎంత మంచి అవకాశం కల్పించాడు! శారదపై వాడికింకో ఆలోచన లేదనిపించింది.

సాయంత్రం అరుస్సరయింది.

తెల్లని బట్టల్లో వీలయినంత ముచ్చటగా

పొనుగంటి జనార్దన్

ముస్తాబయ్యాను. గదికి తాళంవేసి మెట్లుదిగాను. కొండ దిగేదేవతలా మెట్లు దిగుతూంది శారద. చెప్పలేని రాగం గుండె తత్తరపడింది. మామూలు అలంకారాల్లో, తలనిండా పువ్వులతో, కళ్ళపరిధుల్లో నల్లని కాటుకతో, మెళ్ళో సరళంగా తెల్లని ముత్యాలసరంతో, ఆ సంధ్య వెలుగులో వేయి వెలుగుల రాణిగా తోచింది.

ఇద్దరం రోడ్డు ఎక్కాం. శారదతో అంత చనువుగా మాట్లాడటం, ఆమెకంత దగ్గిరగా నడవటం అదే మొదటిసారి. తూచి తూచి మాట్లాడి, మాటల్లో మత్తు చిలికించి, ఆ క్షణంలోనే శారదను వశపరచుకోవాలనే కోరిక మరీ బలీయమయింది.

గుండెల్లో ఓ ఆశాజ్యోతిని వెలిగించుకొని పైకి మామూలుగా "రిక్షా మాట్లాడనా?" అన్నాను.

"ఫర్వాలేదు ఈమాత్రానికే! నడిచే వెళదాం హాయిగా ఉంటుంది" అంది. క్షణం గుండె కలుక్కుమన్నా, నడిచి వెళ్ళడం కూడా ఓ మంచికే అనిపించింది.

కొంతదూరం నడిచాం.

"ఏమండీ, మరీ మూభావంగా నడుస్తున్నారు. ఏమైనా మాట్లాడండి."

"మీరు మాట్లాడండి. నేను వింటాను." ముక్తసరగా అంది.

చిక్కుల్లో పడ్డాను. ఎన్నో మాట్లాడాలనుకున్నాను. సమయానికి ఏమీ జ్ఞాపకం రాలేదు.

మౌనంగా కొంతదూరం నడిచాం.

ఎదురుగా మేళతాళాలతో, అట్టహాసంగా తెట్టించిన విద్యుత్కాంతులతో వస్తున్న ఓ పెళ్ళి ఊరేగింపు కనిపించింది. అది మమ్మల్ని దాటేవరకు ఏమీ మాట్లాడలేకపోయాము.

కొంతదూరం నడిచి మళ్ళీ నిశ్శబ్దం ఆవరించాక సన్నగా అడిగాను.

"ఆ ఊరేగింపును చూసినప్పుడు మీకేమనిపించింది?" అని ఎంత తియ్యగా మాట్లాడా లనుకున్నా, ముందు అడగబోయే ప్రశ్న తాలూకు భయం చిరుచెమటలు పట్టిస్తూంది. మాటకు కొస్త కంపరాన్ని కలిగిస్తూంది.

"ఆ కన్య ఎంత అదృష్టవంతురాలని!" మామూలు గానే అన్నట్లుంది.

ఆ మాటకు నాలో చిగురించిన ఆశ మొగ్గ వేసింది.

"అలాంటి అదృష్టం మిమ్మల్ని వరిస్తే. . .?" అవకాశాన్ని ఉపయోగించుకున్నా ననుకున్నాను.

"ఆడదాని కంతకంటే భాగ్యమేముంది?" మామూలుగానే అంది.

రెండు విద్యుత్స్తంభాల మధ్య చిద్విలాసంగా నిలిచిన చిరుచీకట్లో జంటగా నడుస్తున్నాం. నా కెందుకో పరిసరాలన్నీ అస్పష్టంగా మారాయి. పక్కగా నడుస్తున్న శారదచేతిని లీలగా అందుకొని సుతారంగా నొక్కుతూ "అదృష్టవంతుణ్ణే శారదా, అదృష్టవంతుణ్ణే. . .!" అన్నాను. ఇంకేమన్నానో నాకు జ్ఞాపకం లేదు. నడిచేది రోడ్డుగా కనిపించలేదు. చుట్టూ అంతా గుడ్డివెలుతురు.

శారద నోటినుండి పరుషశబ్దాలు వెలువడు

తూంటే కమ్మని మైకం వదిలింది.

"సూర్యంగారు, క్షమించండి! ఎంత కాలానికో ఓ నిర్ణయానికి వచ్చారు?" కొనసాగింది. వాలిన చేయి ఎప్పుడో జారిపోయింది.

"నా పెళ్లి దాదాపు నిశ్చయమయినట్లే. భగవంతు డనుగ్రహిస్తే పెళ్లికూడా మూడు మాసాల్లో జరగవచ్చు. నిన్నసలు ఆ దృష్టితో నేనెప్పుడూ చూడలేదు...." ఆ తరవాత నా కేమి వినిపించలేదు. ఆ రాత్రి శారద నే విధంగా కాలేజీకి తీసుకువెళ్ళానో, ఎలా ఒంటరిం తిరిగి వచ్చానో అంతంత మాత్రంగానే జ్ఞాపకం ఉంది.

మరునాడు అద్దంలో చూసుకుంటే నా ముఖం నాకే అసహ్యంగా తోచింది. సిగ్గుతో ముఖం జేవురించింది. వెంటనే అంతా ప్రకాశానికి చెప్పాలను కున్నాను. నే నా నిర్ణయం చేసుకునేసరికే మరో మూడు రోజులు గడిచాయి.

"సూర్యం!" ఎవరూలేని సమయాన పిలిచాడు ప్రకాశం.

నా రెండు భుజాలమీద చేతులు వేసి "నిన్ను మించిన ఆప్తు లెవరూ నాకు లేరు. ఇన్నాళ్ళుగా నీనుండి ఒక విషయం దాచాను. మరోలా అనుకోకు. ఫలించిన తరవాతే చెప్పాలనుకున్నాను. అదే జరిగింది. శారదను పెళ్లి చేసుకోబోతున్నాను."

అప్రతిభుణ్ణి అయ్యాను. తిరిగి ప్రారంభించాడు. "రేపు వేసవిసెలవుల్లో ముహూర్తం నిశ్చయించమని నాన్నకు వ్రాశాను. ఇంకంత ఇంటిలో అమ్మలేని లోటు శారద తీరుస్తుందని నా నమ్మకం. నాన్న కూడా ఈ పెళ్లికి అడ్డు చెప్పడు."

ఆ రోజు అలా ముగిసింది. శారద నా ఆశాజ్యోతిగా కొన్నాళ్ళు నా గుండెలో వెల్గిందనీ, ఇప్పటికీ అజ్ఞాతంగా ఓ మూల వెలుగుతూనే ఉందనీ ప్రకాశానికి తెలియదనే అనుకుంటాను.

రోజులు గడిచాయి. ఎవరెవరి జీవితాల రహదారుల్లో వాళ్లం ప్రయాణం చేస్తున్నాం.

సాగులేక పడివున్న భూమిలో, శారద సలహా సహకారాలతో ప్రకాశం బంగారం పండిస్తున్నాడని విన్నాను.

ఏమీలేని నేను, బ్రతకడానికో ఉద్యోగం చూసుకొని, తలిదండ్రులు నిర్ణయించిన ఓ అమ్మాయిని పెళ్లాడి, ఏ విశేషం లేకుండా రోజులు నెట్టుకు వస్తూంటే, ఇన్నాళ్లకు ప్రకాశం దగ్గిరనుండి ఆ ఉత్తరం వచ్చింది.

శారదను చూడాలన్న కుతూహలం ఓ మూల కొలిమిలా అధికమవుతున్నా, ప్రకాశం జబ్బు మదిలో మెదిలేసరికి. . . మరే ఆలోచన కదలలేదు.

వందనం పొలిమేరలు కనిపించాయి. ఊరు, ఊరి పరిసరాలు నిశ్శబ్దంగా ఉన్నాయి. వెతుక్కుంటూ ఇల్లు చేరాను.

ప్రకాశంతండ్రి వెంకట్రామారావుగారు. ఒకప్పుడు తెలంగాణా దొరతనం తిరుగు లేకుండా వెలగబెట్టిన వారు. స్వాతంత్ర్యం వచ్చి ఆ దొరతనం పోయినా, దాని తాలూకు పరిసరాలు, అట్టహాసాలు మాత్రం మిగిలిపోయాయి.

ఆ ఊళ్లోవాళ్లంతా ప్రకాశం ఇంటిని "దొరగారి దేవిడీ" అంటారు. ఆ దేవిడీ ప్రహరీగోడ దాదాపు మూడెకరాల స్థలాన్ని ఆక్రమించుకొని ఉంది. పెద్ద గేటు దాటగానే విశాలమైన ఖాళీస్థలం, ఎదురుగా పురాతన కట్టడాలతో శోభిల్లుతున్న మూడంతస్తుల భవనం, దానికి కుడివేపున పెద్దతోట, వెనకవేపు నౌకర్లనివాసాలు ఒకనాటి అట్టహాసానికి ప్రతీకలుగా ఉన్నాయి.

అప్పటికే తొమ్మిదిన్నరయింది.

ముందు ఖాళీస్థలంలో నౌకర్లు ఇంకా మాట్లాడు కుంటూనే ఉన్నారు. నేరుగా లోనికి వెళ్లాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ముందున్న విశాలమైన హాలులో వెంకట్రామారావుగారు ఏకాంతంగా ఈజీఛైర్లో కూర్చుని వెనక్కి ఒరిగి కళ్లు మూసుకొని ఉన్నారు. సూట్‌కేసును శబ్దం చేస్తూ పక్కనున్న చైర్లో పెట్టి "నమస్కారమండీ!" అన్నాను చేతులు జోడించి.

మెల్లిగా కళ్లు తెరిచి, ప్రతినమస్కారం చేసి, మరునిమిషంలో ప్రకాశం కోసం కబురంపారు.

"హైదరాబాదునుండేనా?" అడిగారు.

అవునన్నట్లు తల ఊపాను. ఎన్నో మాట్లాడాలని ప్రయత్నం చేశాను. ఎలా ప్రారంభించాలో అంతు దొరకలేదు.

హడావిడిగా ప్రకాశం రావడం, నన్ను కౌగిలించుకొని లోపలికి తీసుకువెళ్లడం జరిగాయి.

పైన, ప్రకాశం గదిలో భోజనాలేర్పాటయ్యాయి.

ప్రకాశం, నేను టేబులుకు ఎదురెదురు కూర్చున్నాం.

రేడియో సన్నగా పాడుతూంది. ఫాను హాయిగా తిరుగుతూంది.

ఒక్కసారి ప్రకాశాన్ని నిండుగా చూశాను. కాలేజిరోజులకు ఇప్పటికి కాస్త ఛాయ వచ్చింది. తెల్లని లాల్చీ పైజామాల్లో, ఫ్లోరసెంట్ లైట్ కాంతుల్లో నిండుగా తోచాడు.

"ఏరా, అలా చూస్తున్నావు?"

పైకి ఇంత ఆరోగ్యంగా కనిపించే ఈ మనిషికేనా గుండెజబ్బు అనుకున్నాను.

"ఏం ఆలోచిస్తున్నావురా? 'పైకి పైలా పచ్చీసులా కనిపించే వీడికేనా గుండెజబ్బు' అని అనుకుంటున్నావా?"

ఆశ్చర్యపోయాను నా మాటకు.

"సూరీ, ఈ జబ్బు చాలా విచిత్రమైందిరా. కుమ్మరిపురుగు గుండెలో చేరి తొలికినట్లు ఒకటే బాధ. ఇది క్రమక్రమంగా నాకు నిరాశన్ని కలిగిస్తూంది. ఆఖరికి ప్రాణంతో..."

"భోజనం చేయండి!" వడ్డిస్తూన్న శారద అంది. శారద లోనికి రావడం, మా ఇద్దరికీ వడ్డించడం లీలగానే కనిపించింది. ప్రకాశం సూటిగా నా ముఖంలోకి చూసి చెబుతూంటే చూపు అటూ ఇటూ మరల్చలేకపోయాను.

"చూశావా? ఈ దేవతే కనక నా భార్య కాకుంటే నా ప్రాణం గూర్చి అంత బాధ పడేవాణ్ణి కాదు."

క్షణంపాటు తల ఎత్తి శారద ముఖంలోకి చూశాను. ఆ క్షణాన శారద మామూలు మనుష్యుల్లో మనిషిగా తోచలేదు. నేను చూసిన అయిదేళ్ల నాటి శారదకు ఎంతో తేడా కనిపించింది.

ఆ రాత్రి నేనూ, ప్రకాశం చాలా పొద్దు పోయేవరకు


## సక్రమంగా బ్రష్‌తో తోముకుంటే ఫోర్‌హాన్స్ టూత్‌పేస్టు పనుచిగుళ్ల బాధలను దంత క్షయమును నిలుపును

పిన్నా, పెద్దా అనే భేదం లేకుండా అనేకులు అయాచితంగా పంపిన ప్రశంసా పత్రాలు ఫోర్‌హాన్స్ టూత్ పేస్టు శ్రేష్ఠతను చాటుతున్నాయి. ఫోర్‌హాన్స్ టూత్ పేస్టు ఇగుళ్ళు మరియు పళ్ళ జాగ్రతకై ప్రత్యేకముగా సూత్రీకరింపబడినది. ప్రతి రాత్రి, ఉదయమూ ఫోర్‌హాన్స్ టూత్ పేస్టు వేసి మీ పళ్ళను బ్రష్‌తో తోముకుంటే నిశ్చయంగా మీ ఇగుళ్ళు ఆరోగ్యవంతమైనవిగాను, మీ పళ్ళు దృఢముగా, నిగనిగ లాడేవిగాను వుంటాయి.

**ఫోర్‌హాన్స్**—ఒక దంత వైద్యునిచే నిర్మించబడిన టూత్ పేస్టు

ఉచితము! 'పళ్ళు ఇగుళ్ళను గురించి తీసుకోవలసిన శ్రద్ధ' అనే రంగుల చిన్న పుస్తకం. ఇంగ్లీషు, తెలుగు భాషల్లో లభిస్తున్న యీచిన్న పుస్తకము కావలసిన యెడల యీ కూపన్ 10 పైసల తపాలా బిళ్ళలతో పాటు (తపాలా ఖర్చుల నిమిత్తం) మానర్స్ డెంటల్ అడ్వయిజరీ బ్యూరో, పోస్టు బ్యాగ్ నెం. 10031, బొంబాయి-1కి పంపండి.

పేరు..........................................

చిరునామా..........................................

భాష..........................................

Z-14

జెఫ్రి మానర్స్ అండ్ కంపెనీ లిమిటెడ్ 7Fr TEL

మాట్లాడుకున్నాం. మాటలమధ్య, మరునాటి రాత్రి పదకొండు గంటల రైలుకే రాయవేలూరు ప్రయాణం అని తెలిసింది.

ఉదయం కాఫీ ఫలహారాలు ముగించి నేనూ, ప్రకాశం సేద్యాన్ని, పంటపొలాల్ని చూడ్డానికి బయలుదేరాం.

పచ్చని తుంపరల మధ్య నీ రెండ ముచ్చటగా ఉంది.

నాలుగు పది హెచ్. పి. ల విద్యుత్ మోటార్లు నాలుగు బావుల వద్ద ఉన్నాయి. రెండు బావులకింద ప్రత్యేకంగా వరిసేద్యం. మరో బావికింద వంకాయ, బెండకాయ, టొమాటో, బీర, చిక్కుడు మొదలగు కూరగాయతోటలు, మరోవేపు ముచ్చటగా కొత్తిమిరి, మెంతికూర, వెల్లుల్లి, పాలకూర మొదలగు వాటి మడులు, బొమ్మరిండ్లలా అందంగా ఉన్నాయి. మరో బావికింద నిమ్మ, నారింజ, జామ మొదలగు ఫలవృక్షాలు, వివిధరకాల బంతులు, మల్లెలు, ఎర్ర, తెల్ల గన్నేరు మొదలగు పూలమొక్కలు అందంగా ఉన్నాయి. ఏ వేపు చూసినా సస్యశ్యామలంగా కనులపండువుగా ఉంది.

అంతా చూసిన తరవాత, ప్రస్తుతం ప్రభుత్వం వస్తున్న విద్యుత్సదుపాయాన్ని ప్రకాశం పరిపూర్ణంగా ఉపయోగించుకుంటున్నా డనిపించింది.

ఆఖరుకు ఓ చల్లని తరుచ్ఛాయలోకి చేరాం.

"మొత్తానికి బంగారం పండిస్తున్నావురా" అన్నాను.

"ఈ బంగారం పండడానికి, కారణం ఎవ్వరో తెలుసా?"

"నాచేత గొప్పలు చెప్పించుకోకు, నీవే!" హాస్యాలాడి ప్రకాశానికి కాస్త ఓదార్పు కలిగించాలను కున్నాను.

"నేనే. కాని నాకు శ్వాస?" అర్ధోక్తిలో ఆగాడు. క్షణం ఆలోచించి "ఓహో, శారదా!" అన్నాను.

"ఇదంతా ఆ మూర్తి ప్రోత్సాహమే సూర్యం! నాన్న నిశ్చింతగా కాలం గడపడానికి, తమ్ముడు రెట్టింపు ఉత్సాహంతో చదవడానికి, చెదిరిన చెల్లి కాపరం బాగుపడడానికి, పాలేర్లంతా నిండుగా సహకరించి పాటుపడడానికి, ఊళ్లో వాళ్లందరికీ మా కుటుంబ మంటే ఓ మంచిచూపు ఏర్పడడానికి, ఆఖరికి ఈ పంటలింత నిండుగా ఫలించడానికి, ఆ పూవులంత అందంగా వికసించడానికి, ఈ పరిసరంలోని గాలి ఇంత హాయిగా వీచడానికి కూడా నా దేవత శారదే కారణం. నిజం సూర్యం నా శారదే కారణం..." అప్రయత్నంగా గొంతు బొంగురు పోయింది.

"..............."

"కాని భగవంతుడు నా కన్యాయం చేయబోతున్నాడు."

మధ్యలోనే అందుకున్నాను. "ప్రకాశం! వైద్యవృత్తి, నిపుణతలతో మెరుగులు దిద్దుకుంటూన్న ఈ రోజుల్లో ఏ జబ్బూ నయం కాకుండాపోదు. అనుక్షణం అధైర్యపడుతూ నీ కేమవుతుందోనని ఇకముందు వాపోకు. నిశ్చింతగా ఉండు. భగవంతుడు తప్పకుండా మనకు మేలు చేస్తాడు."

"నా గురించి నేను బాధ పడ్డంలేదు సూర్యం. నే పోతే పరిస్థితుల్ని ఊహించుకోలేకపోతున్నాను."

చిన్నగా నవ్వాను. "అంత దూరం ఆలోచించకు ప్రకాశం! భవిష్యత్తును ఉజ్జ్వలంగా ఊహించుకొని చింతిల్లడం పిరికివాడి లక్షణం. ఉజ్వలంగా ఉందను కోవడంలోనే జీవితాన్ని సాగించాలి. అన్నీ సక్రమంగా జరుగుతాయి." సాధ్యమైనంత సానునయంగా ధైర్యం చెప్పాను.

కాని, నే పోసిన ధైర్యం పనిచేసినట్లు లేదు.

"సూర్యం! మనిషికి ఆశలు కాసారంలోని అలల్లాంటివి. గాలివాటు మీద ఆధారపడిన అలలు, ఎండుటాకుల్ని ఏ ఒడ్డుకు తీసుకువెళ్లేదీ వాటికే తెలియదు. అదృష్టంమీద ఆధారపడిన మనిషి ఆశల ఫలితాలు కూడా మనిషి నెటు తీసుకువెళతాయో తెలీదు. నా ఆశలు నా కనుకూలంగా ఫలిస్తాయని ఎలా అనుకోను?"

ఆవేశంలో ఇంకేవేవో మాట్లాడుతున్నాడు. వాడి వేదాంతానికి నా రాశ్చర్యం వేసింది. బలవంతం మీద విషయాన్ని మార్చి ఇంటికి బయలుదేరాం.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు బయలుదేరాం. మేనాలాంటి కాడెద్లబండిలో శారద, ప్రకాశం ఎక్కారు. నేను, వెంకట్రామారావుగారు, మరి కొందరు కుటుంబ శ్రేయోభిలాషులు, పాలేర్లు కాలినడకలో బండి వెనక బయలుదేరాం. ఊరు వదులుతూంటే ఎందరో ఆడవాళ్లు కంట నీరు పెట్టుకొని శారదాప్రకాశాలకు వీడ్కోలిచ్చారు. ఆ పల్లెవారి ఆత్మీయతలకు మనస్సు లోనే జోహార్లర్పించాను.

నిండు వెన్నెల, నిశ్చలమైన వాతావరణం, ముందు బండి, వెనక మేము అదొక మహాప్రయాణంలా తోచింది. ప్రకాశం పల్లీ మామూలు మనిషై తిరిగి రావాలని మనసులో వేయి దేవుళ్లకు మొక్కుకున్నాను.

స్టేషన్లో గుడ్డివెలుతురు నిండుకున్న ఓ చెట్టుకిందికి శారద, ప్రకాశం చేరారు. ప్రకాశం తనవద్దకు నన్ను పిలిచి కొన్ని వందరూపాయల నోట్లు ఇస్తూ

"ఇవి నా ఆరోగ్యాన్ని దూరం చేయడాని కుపయోగ

ఆరోగ్యము
బాగుగా ఉండేలా చూచుకొనుటకు
మీకు ముఖ్యమైన
విటమినులు
మరియు
ఖనిజ లవణములు
ప్రతిరోజు కావాలి...



వాటిని పొందుటకు ఒక
విమ్‌గ్రాన్
బిళ్ల మాత్రమే చాలును
దీనితో 11 ముఖ్యమైన విటమినులు మరియు 8 ముఖ్యమైన ఖనిజ లవణములు కలవు
ఒక విమ్‌గ్రాన్ మిమ్మల్ని రోజంతా శక్తివంతముగా ఉంచుతుంది. విమ్‌గ్రాన్‌ను నేడే కొనండి!
SQUIBB SARABHAI CHEMICALS

పడాలనుకుంటున్నాను. ఏమో, చెప్పలేను! అంత్యక్రియల కుపయోగపడతాయేమో!" అన్నాడు చిరునవ్వు చిందిస్తూ.

అఘాతం లాంటి మాటకు నా నోరు పెగలలేదు.

నిశ్చేష్టఅయిన శారద కళ్లవెంట రెండశ్రువులు గబుక్కున వెలువడి ఆ మసక వెలుతుర్లో మెరవడం స్పష్టంగా చూశాను.

ఓదార్పుగా ఏదో చెప్పబోయాను.

"ఫరవాలేదు, వెళ్లి టికెట్లు పట్టుకురా." పురమాయించాడు.

గుంభనంగా రోదిస్తున్న వెంకట్రామారావుగారిని, తదితరులను ఓదార్చి వీడ్కోలు తీసుకున్నాం.

అదృష్టం కొలదీ ఆ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ఇతర ప్రయాణీకులు లేరు. ఓ వేపు ప్రకాశం, శారద కూర్చున్నారు. మరోవేపు నేను కూర్చున్నాను.

బాధ దిగమింగుతూ పైకి చిరునవ్వుగా ఈటెల్లాంటి మాటలు విసురుతున్న ప్రకాశానికి ఎలా ధైర్యం చెప్పాలో అర్థం కాలేదు.

నిశ్శబ్దంగా రోదిస్తూ, మాటిమాటికి కనుగుడ్లల్లో నీళ్లు నింపుకుంటూన్న శారదను ఎలా ఓదార్చాలో అంతకంటే అర్థం కాలేదు.

ఇలాంటి పరిస్థితుల్లో నా కంటే, ముసలివాళ్లెవరైనా ఉంటే బాగుండేదేమో అనిపించింది.

రైలు చేస్తున్న చప్పుడు తప్ప మరింకే శబ్దమూ లేదు.

స్టేషన్లు వెనక్కి వెళుతున్నాయి.

రైలు ముందుకు వెడుతూంది.

ఆలోచనల మధ్య కునుకు పట్టింది.

కెవ్వునకేకతో మెలకువ వచ్చింది. కళ్లు తెరిచి చూస్తే, కలలో కూడా ఊహించనిది కళ్లముందు కనబడింది. ఆ దృశ్యాన్ని చూసి బొమ్మలా నిలుచుండిపోయాను. కట్టెలా మారిన ప్రకాశం శరీరంపై కూలి, స్పృహ కోల్పోయింది శారద.

కొన్ని ఘడియలవరకు నా కర్తవ్యం నాకే బోధపడలేదు.

కాసేపటికి తేరుకొని, వచ్చే స్టేషన్ వరకు వేచి ఉన్నాను.

ఓ చిన్న స్టేషన్లో ఆగింది రైలు, పరుగున దిగాను. కారుచీకటి దట్టంగా అలుముకొని ఉంది. దానికితోడు ఎడతెరిపిలేని వర్షం. రైల్వే అధికారులతో మాట్లాడి పోలీసులసహాయంతో ప్రాణంలేక శవంగా మారిన ప్రకాశాన్ని, ప్రాణం ఉండీ శవంలా ఉన్న శారదను టాక్సీలో వేసుకొని నిండువర్షంలో నందనంవేపు బయలుదేరాను.

మెదడు పూర్తిగా మొద్దుబారిపోయింది. ఏం చేయాలో, ఏం చేశానో ఏ మాత్రం జ్ఞాపకం లేదు. నందనం చేరేసరికి పగలు రెండు గంటలయింది. ప్రకాశం కుటుంబానికి ఎలా సంజాయిషీ చెప్పుకున్నానో, ఆ ఊరిప్రజలకు ఎలా నచ్చచెప్పానో, ప్రకాశం అంత్యక్రియలు ఎలా ముగిశాయో అంతంత మాత్రంగానే జ్ఞాపకం ఉంది.

ఇరవై రోజులు గడిచాయి.

నా ఉద్యోగం ఉందనీ, శ్రీమతి పురుడుపోసుకోడానికి వెళ్లిందనీ ఏమాత్రం జ్ఞాపకం లేదు. ఆ ఇంట్లో నేనూ ఒకణ్నిగా విలపించసాగాను.

కనులపండువుగా కలకల లాడిన ఆ ఇల్లు, ప్రకాశం మరణంతో పేరుకున్న విషాదచ్ఛాయలతో వెలవెలబోయింది. మామూలు పరిస్థితుల్లోకి తీసుకు రావడానికి నాకు తోచిన ప్రయత్నమల్లా చేశాను.

నిద్రాహారాలు మాని, శోకదేవతై, మౌనవ్రతం సాగించిన శారదను మామూలుమనిషి నెలా చేయాలా అని నిరంతరం ఆలోచించాను.

ఓ రాత్రి దాహం అవుతూంటే లేచాను. శారద గది తలుపులు తెరిచే ఉన్నాయి. బెడ్‌బల్బు కాంతివంతంగా వెలుగుతున్నా, గదిలో గుడ్డివెలుతురు నిండుకొని ఉందనిపించింది.

మెల్లిగా లోనికి వెళ్లాను. మంచంలో కూర్చొని, కురులు విరబోసుకుని మోకాళ్లమీద తల ఆన్చి శూన్యంలోకి చూస్తూంది శారద.

మెల్లిగా దగ్గరికి వెళ్లి "శారదా!" అన్నాను డగ్గుత్తికతో.

పలకలేదు.

తలవంచి కళ్లల్లోకి చూశాను. ఆగిన చూపుల్లో నుండి అశ్రువులు ప్రవహిస్తున్నాయి.

చేయి ఊపుతూ "ఏమిటి శారదా?" అన్నాను.

నా చేయి ఊతంగా తీసుకొని తల వంచుకుని పిచ్చిదానిలా బావురుమంది. నా చేతికి తగిలిన వెచ్చని కన్నీరు చురుక్కుమంది.

ధైర్యంచేసి తల ఎత్తి కన్నీరు తుడుస్తూ "శారదా!

> **నిజం**
> నిజం చెప్పడాని కెంతయినా గుండెదిటవు కావాలి. అసత్యాని కేదీ అవసరం లేదు. —హెర్బర్ట్

నీవు మామూలు మనిషివైన తరవాతే నే నిక్కడనుండి వెళ్లాలనుకున్నాను. కాని నీ పరిస్థితి చూస్తూంటే నే నెప్పుడు వెళ్లేది తెలియకుండా ఉంది. ఒక్కసారి ఇంట్లో అందరినీ చూడు. వెంకట్రామారావుగారు సగమయ్యారు. పిల్లలు అనాధల్లా ఉన్నారు. పరీక్షలు వదిలి బాబు వచ్చాడు. అన్నీ తెలిసిన నీవే. ."

"సూర్యం, నా దేవుడు నన్నుహతను చేశాడు, సూర్యం. నా కన్యాయం చేశాడు. ." అమితంగా ఏడుస్తూ బావురుమంది. ఓదార్చబోయి విఫలుణ్ణి అయ్యాను. ఏం చేయాలో తోచక బయటకు వచ్చి మంచంలో వాలాను.

'శారద బ్రతుకు చిగురించడానికి మరో మార్గం లేదా?' అప్రయత్నంగా ఊహించని ప్రశ్న మెదిలింది మనసులో.

'శారద మామూలు మనిషి కావాలంటే ఏం చేయాలి? నేనేమైనా చేయగలనా? ఏం చేయగలను? ఏం చేయగలను!?' ప్రశ్నపరంపర పరుగులిడుతూంది.

'శారదను నే స్వీకరించలేనా?'

గుండె ఝల్లుమంది.

కొద్ది క్షణాలు శ్వాసాడలేదు.

స్వార్థం అంటువ్యాధిలా వృద్ధి అవుతూంది.

'శారదను నాదాన్ని చేసుకోగలను.' మనసు పేరాశ పడింది.

'మరి నీ శ్రీమతి మాటేమిటి?' అంతరాత్మ కఠినంగా ప్రశ్నించింది.

'ఇద్దరు భార్యలయితే నీ ఉద్యోగం గతేమిటి? నీ ఉద్యోగం ఊడితే నీ గతేమిటి?' హేళనంగా నవ్వింది అంతరాత్మ.

కోరనిట్టేములా ప్రకాశం రూపం దీనంగా ప్రత్యక్షమయింది. చేత లుడిగిపోయాయి!

"నా చావు గురించి నే బాధ పడ్డంలేదు. కాని నే చస్తే నా దైవం రూపు తలుచుకొని. . ." ప్రకాశం దీనంగా వాపోతున్నట్లనిపించింది.

'నేను తప్పుచేస్తే నన్ను క్షమించు ప్రకాశం! నా స్వార్థంలో కూడా నీ దేవత రూపం దైవంలానే నిలిచిపోతుంది.' మనసు ప్రకాశానికి సంజాయిషీ చెప్పింది.

"ఎంత మిత్రద్రోహం!" ఆశ్చర్యంగా వాపోతూంది అంతరాత్మ.

అంతరాత్మ మాటలకు మనసు చెవి ఒగ్గే స్థితిలో లేదు. శ్రీమతిని సమాధానపరచుకోగల ననిపించింది. ఉద్యోగం ఊడితే తిరిపెమెత్తి పోషించుకోగలననిపించింది. ఆఖరుకు ఓ దృఢనిశ్చయం మనసులో ధ్రువపడగా నిద్ర పట్టింది.

మరో పదిహేను రోజులు గడిచాయి.

మంచుగా మారిన నదులు తిరిగి ప్రవహిస్తున్నాయనిపించింది.

స్తంభించిందనుకున్న కాలచక్రం తిరిగి భ్రమణం సాగించిందనిపించింది.

ఓ చల్లని సంధ్యలో మేడ ఎక్కాను. దూరంగా ఎక్కడో ఆకాశంలోకి శూన్యంగా చూస్తున్న శారద కనిపించింది.

మెల్లిగా దగ్గరికి వెళ్లాను. మనసు తన నిర్ణయాన్ని తెలియజేయమని ఆత్రత పెడుతూంది.

"శారదా!" సాధ్యమైనంత మృదువుగా పిలిచాను.

నా ఉనికిని గమనించి ఊరుకుంది.

"మోడువారిందనుకున్న నీ జీవితం చిగురించడానికి మార్గాలే లేవా?" సానునయంగా ప్రశ్నించాను.

అర్థం కానట్లు నా ముఖంలోకి చూచింది.

"ఎన్నో మాట్లాడాలనుకున్న నేను, నీ గంభీరవదనం చూసేసరికి ఏమీ మాట్లాడలేకపోతాను."

"ఏమిటి సూర్యం, నీవు మాట్లాడదలుచుకుంది?" నూతిలోనుండి పలికినట్లు ప్రశ్నించింది.

"నీగురించి నీకంటే ఎక్కువగా ఆలోచిస్తున్నాను శారదా!"

నిర్లిప్తంగా నవ్వింది.

"అలా నవ్వకు శారదా, నా మాట నమ్ము. నిన్నుమళ్లీ దేవతను చేస్తాను. నీలో చైతన్యం సృజిస్తాను."

అర్థం కానట్లు పరీక్షగా చూస్తోంది.

"నన్ను మన్నించు శారదా, నిన్ను నా దేవిగా చేసుకుంటాను. ." ఆవేశంతో మాట్లాడుతూ శారద చేతి నందుకున్నాను.

అంతే! నా చెంప ఛెళ్లుమంది.

కళ్లు బైర్లు కమ్మాయి.

"ఇంత నీచగుణాలున్న నీవు నా దైవానికి ప్రాణమిత్రుడివంటే ఎలా నమ్మను?" అని బావురుమంటూ, పిచ్చిగా అరిచి, తల బాదుకొని, కూలిపోయింది.

ఆ తరవాతేం జరిగిందో తెలుసుకోడానికి నేనా నందనంలో లేను. ★